కాస్పేపాగి, "తిన్నట్టుగాదు. అందురూ కొంచెం పనిగూడా చెయ్యాల... రెండు గంటల రైలు కూత గూస్తా వుంది. యింకా మావోళ్లు రాలేదు. మీ రిద్దరూ కొంచెం ఆ పెట్రోలు బంకుదాంకా పోయి టేషనుకు ఫోనుగొట్టి రండి. నంజీవిగాడు యింటి చుట్టూరా నాలుగు రవుండ్లు గొట్టొస్తాడు. యీ నందులో నేనో తూరి మూలస్థానమ్మ ప్రత్యేకంగా పడేకష్టమేందో తెలుసుకుంటాము.." అన్నాడు గురవయ్య.

నంజీవి ధిగ్గున పైకి లేచి విల్లువి, విలువుగుడ్లేసుకుని కొయ్యబారిపోయాడు. మునిరత్నంనాయుడుకేసి చూస్తూ సుబ్బయ్య పళ్లికిలించాడు.

లారీలు ఢీకొన్నట్టుగా, పిడుగులు రాలినట్టుగా, కొండరాళ్లు దొర్లినట్టుగా ప్రసాదరెడ్డి బంగళా ముందు నుంచీ పెద్ద శబ్దమొకటి హోరెత్తుకొచ్చింది. అనంపూర్తి భవనంలోని అయిదుగురు మనుషులూ వులిక్కిపడి వెలుపలికి పరిగెత్తుకొచ్చారు. జరుగుతున్నదేమిటో వాళ్లు గుర్తించేలోగా మరోసారి అలాంటి శబ్దమే వినవచ్చింది. ఇంటిలోంచీ పెద్ద హాహాకారం పరతెంచి వచ్చింది. యింతలో యింటి చుట్టూ వున్న విద్యుద్దీపాలన్నీ భళ్లున వెలిగాయి. యేదో వింత జంతువు గొంతు చించుకుంటున్నట్టుగా పెద్ద సైరను శబ్దమొకటి చెవులుగింగర్లెత్తేలా పెల్లుబికి వచ్చింది. అంతవరకూ వెలుతురును ప్రసారంచేస్తున్న యేకైక కిటికీ దగ్గర మాత్రం ఘాఢమైన చీకటి పేరుకుపోయింది.

"యెవురో గ్రిల్ తలుపులు పగలగొడతా వుండారన్నా!" అన్నాడు నంజీవి భయమూ, ఆందోళనా నిండిన కీచుగొంతుకతో.

ప్రసాదరెడ్డి బంగళా ముఖద్వారం దగ్గర బనీనూ, నిక్కరూ మాత్రమే తొడుక్కున్న నన్నటి మనిషొకడు దాదాపుగా తన చేతులంత లావే వున్న యినపకమ్మీతో గ్రిల్ తలువుల్ని బద్దలుకొడుతున్నాడు.

"రేయ్! యెవుడాల ఆడ తలువులు గొట్టేది? చమడా తోలు వొలిచేస్తాను వుండాకోర్" అని అరుస్తూ మోల్డింగ్ కమ్మీ నొకదాన్ని చేతబట్టుకుని సుడిగాలిలా బంగళా ప్రహరీదాకా పరిగెత్తుకెళ్లిన సుబ్బయ్య, మళ్లీ అదే వేగంతో వెనక్కు తిరిగొచ్చి "న్నోవ్! వొక్కడుగాదు. మిద్దెపైన జూడు. యిద్దరు నవుర్లు నిక్కి నిక్కి జూస్తావుండారు..." అన్నాడు రహస్యం చెబుతున్నట్టుగా.

ట్రంకు రోడ్డు వైపుకు తిరిగి చూసిన మునిరత్నంనాయుడు "సార్! సార్! అక్కడ జూడండి. యిద్దురు మనుషులు యీ పక్కనే వస్తావుండారు" అన్నాడు ఆందోళనతో వూగిపోతూ.

వొకటి రెండు నిముషాలు అటే పరీక్షించి చూసి "వొరే నంజీవీ! ఆ వచ్చేది మా జవాన్లుగావే వుండాది. వాళ్లనట్లే పెట్రోలు బంకుదాంకా పోయి, టేషనుకు ఫోనుజేసి, యెందురుంటే అందురు జవాన్లనూ అంపించమని చెప్పమను. అర్జెంటుగా లగెత్తు..." అని ఆర్డరు వేశాడు.

యీలోగా వీడల్లా నడచివస్తున్న జవానులిద్దరూ చేమలోపడ్డ నందుల్ని తరుముకునే జోగలవాళ్లల్లా పెద్దగా అరుస్తూ రోడ్డుపైన వెళ్లే వాహనాల్ని ఆకర్షించే ప్రయత్నం చేయసాగారు.

"సార్! ఆయెనక పక్క గూడా యెవురో గేటు కొడతా వుండారు..." అంది మూలస్థానమ్మ దాదాపు యేడుస్తున్నట్టుగా.

"వొరేయ్ నంజీవీ! ఆత్రం వద్దు. ముందుగా వాళ్లెంత మందుండారో లెక్క గట్టాల. అవ్వడుగానీ మనం అటాక్‌జెయ్యలేం. గేటు దగ్గిర వొకడు. యెనకాల వొకడు. మిద్దెపైన యిద్దురు. కాంపోండు గోడ దగ్గిర వొకడు. వానికి మూరడుగుల దూరంలో వొకడు. యీ మాదిరిగా వాళ్లెంతదూరం నించీ వలేసుకోని కుచ్చేసుండారో తెలవటం లేదు. వాళ్ల చేతుల్లో కట్టెలూ, కత్తులూ, బిచువాలే వుండాయో లేకపోతే తుపాకులూ, బాంబులే వుండాయో తెలియకపోయ. మనముండేది నలుగురు. యిప్పుడేం జెయ్యాల?" అంటూ గురవయ్య యెటూ పాలుపోక నిలబడిపోయాడు.

గ్రిల్ తలువులు కొద్దిగా విరిగినట్టున్నయి. పగలగొడుతున్న శబ్దంలో మార్పు స్పష్టంగా వినబడుతోంది. వెనుకవైపున బల్బులు పగులుతున్న శబ్దం...

# క్యాలండర్ల మ్యూజియం!



కొత్త సంవత్సరం ఆవిర్భావంతో పాటు కొత్త కొత్త క్యాలండర్లు కూడా అనేక రంగుల్లో ముచ్చటగా, అందంగా వెలువడతాయి. అవంటే అందరికీ ఇష్టమే. వీటిని సేకరించి ఇళ్లల్లో అలంకరించి, ఆనందిస్తూ వుంటారు.

అయితే అదేపనిగా క్యాలండర్లను సేకరించి, వాటిని ప్రదర్శించేవారు బహు అరుదు. అటువంటి వారిలో సుమానంద ఒకరు. ఆయన కలకత్తాలోని రామకృష్ణ ఆశ్రమంలో, ఆశ్రమం కార్యకలాపాలను నిర్వహిస్తూ వుంటారు. సుమానందకు క్యాలండర్లు అంటే మహాప్రీతి! 40 సంవత్సరాల నుంచీ పదివేల అపురూపమైన క్యాలండర్లను సేకరించాడు ఆయన. సుమానంద వద్ద ఒక అపురూపమైన ఇటలీ క్యాలండర్ వుంది. అది 120 పేజీల రంగుల బొమ్మలతో చూపరులను మంత్రముగ్ధులను చేస్తుంది.

సుమానంద 1954వ సంవత్సరంలో "ఇంటర్నేషనల్ క్యాలండర్ ఎగ్జిబిషన్ సొసైటీ"ని స్థాపించారు. ఆ సంస్థకు ఆయన సెక్రటరీ. క్యాలండర్లను సేకరించే వారినీ, వాటిని తమ ప్రకటనలతో ముద్రించే వారినీ ప్రోత్సహించడం కోసం సుమానంద ఈ సొసైటీని నెలకొల్పాడు! బెంగుళూరులో ఈ మధ్య ఈ సొసైటీవారి క్యాలండర్ల ఎగ్జిబిషన్ జరిగింది. ఇందులో 68 బహుమతులు పొందిన అతి అందమైన క్యాలండర్లు ప్రదర్శించబడ్డాయి! ఇవి ఆస్ట్రేలియా, చైనా, ఫిన్‌లాండ్, జర్మనీ, భారతదేశం, ఇజ్రాయిల్, ఇటలీ, జపాన్, నేపాల్, రష్యా, థాయిలాండ్, అమెరికా, ఇంగ్లాండు వంటి ప్రముఖ దేశాల నుంచి వచ్చిన క్యాలండర్లు ఈ ఎగ్జిబిషన్లో పాల్గొన్నాయి!

ప్రపంచం మొత్తంమీద బహు అందమైన క్యాలండర్లు బ్యాంకులు, ఎయిర్‌లైన్ కంపెనీ వారు ప్రచురిస్తున్నారు. చైనీస్ ఎయిర్‌లైన్స్ కంపెనీల వారు, థాయ్‌లాండ్ ఎయిర్‌వేస్, ఎయిరో ఫ్లాట్ వంటి సంస్థలు సుందరమైన క్యాలండర్లను ముద్రిస్తున్నాయి! ఇటువంటి అపురూపమైనవి అన్నీ సుమానంద వద్ద వున్నాయి. ప్రముఖ ఆర్టిస్ట్ గణేష్ పైనే చిత్రించిన అద్భుతమైన చిత్రాలతో కూడిన ఒక క్యాలండర్ ఆయన వద్ద వుంది.

తన వద్ద వున్న క్యాలండర్లతో ఒక మ్యూజియంను నెలకొల్పే ప్రయత్నంలో వున్నాడు సుమానంద.

–కొడిమెల శ్రీరామమూర్తి

